నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | SANGAREDDY

సంగారెడ్డి జిల్లా హద్నూర్‌లో చలి మంట కాచుకుంటున్న ప్రజలు

మళ్లీ పెరిగిన చలి తీవ్రత

కోహీర్‌లో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

జహీరాబాద్, డిసెంబర్ 12: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజవర్గంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. చలికి ప్రజలు వణుకుతున్నారు. గురువారం జహీరాబాద్ నియోజకవర్గంలోని మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని కోహీర్‌లో 9,1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్‌కల్‌లో10.1 డిగ్రీలు, జహీరాబాద్ మండలంలోని అల్గోల్‌లో 11,2, మల్చాల్మాలో 11.8, సత్వార్‌లో 12.5, జహీరాబాద్ 12.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలి నుంచి రక్షణకు ప్రజలు చలిమంటలు కాచుకుంటున్నారు. ముంబయి-హైదరాబాద్, జహీరాబాద్-ఝరాసంగం, కోహీర్, తాండూర్, వికారాబాద్, బీదర్-జహీరాబాద్, అల్లాదుర్గం, న్యాల్‌కల్-బీదర్, నారాయణఖేడ్‌కు వెళ్లే రహదారులు రాత్రి 8 గంటలకే నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ
- కంది సెంట్రల్ జైల్‌లో విచారణ

మీడియాతో మాట్లాడుతున్న ఐజీ

కంది, డిసెంబర్ 12 : గుండెపోటు వచ్చిన లగచర్ల బాధిత రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేసి చికిత్స కోసం సంగారెడ్డి దవాఖానకు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై స్పందించిన ప్రభుత్వం విచారణ జరపలాని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించింది.గురువారం రాత్రి మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ కందిలోని సెంట్రల్ జైల్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్‌తో కలిసి జరిగిన సంఘటనపై గంటకు పైగా విచారించారు. సేకరించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఐజీ మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చి చికిత్స నిమిత్తం తరలించే వ్యక్తికి బేడీలు వేయడం కరెక్ట్ కాదన్నారు. కంది జైల్ నుంచి బాధితుడిని చికిత్స కోసం తీసుకెళ్లింది ఇక్కడి వారు కాదని, సైబరాబాద్ పోలీసులని తెలిపారు. వారికి హీర్యా నాయక్ లగచర్ల బాధితుడని తెలియక పోవచ్చని, ఏదో కేసులో ఉన్న ఖైదీ అని అనుకోని ఉండవచ్చన్నారు. ఇది తెలిసి జరిగిందా, తెలియక జరిగిందా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. తెలిసి జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. జైల్‌లో సేకరించిన వివరాల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఐజీ తెలిపారు.

కంది జైల్లో లగచర్ల బాధితులకు పరామర్శ

లగచర్ల బాధితులను పరామర్శించేందుకు కంది జైల్‌కు వచ్చిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, డిసెంబర్ 12: కంది సెంట్రల్ జైల్‌లో లగచర్ల బాధితులను గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. జైల్లో ఉన్న లగచర్ల బాధితుడు ఈర్యానా యక్ గుండెపోటుకు గురవ్వడంతో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో ఈర్యానాయక్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మిగితా బాధితుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు జైల్‌కు వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

సిద్దిపేట సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం స్వీకరిస్తున్న హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లు ఆగం

- ఒక్క ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోనే రూ.9,50,000 మెస్‌చార్జీలు పెండింగ్
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు..
- టవల్స్, ప్లేట్లు, గ్లాస్‌లు, షూస్ రాక విద్యార్థుల ఇక్కట్లు
- వెంటనే మెస్‌చార్జీలు విడుదల చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆకస్మిక సందర్శన

ఆరునెలల నుంచి మెస్‌చార్జీలు ఇవ్వడం లేదు • అప్పులు తెచ్చి వార్డెన్లు హాస్టల్ నడిపే దుస్థితి



సిద్దిపేట సమీకృత బాలుర వసతి గృహంలో బియ్యాన్ని, వండుతున్న అన్నాన్ని పరిశీలిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 12 : ఆరునెలల నుంచి మెస్‌చార్జీలు రాక వార్డెన్‌లు అప్పులు తెచ్చి హాస్టళ్లు నడిపించే పరిస్థితి నెలకొందని, కాంగ్రెస్ పాలనలో సంక్షేమ హాస్టళ్లు ఆగమయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెస్‌చార్జీలు రాకపోతే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా అందుతుందని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. సిద్దిపేట పట్టణంలోని సమీకృత బాలుర వసతి గృహాన్ని గురువారం హరీశ్‌రావు ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ మెనూ ప్రకారం సరైన భోజనం పెడుతున్నారా లేదా, దుప్పట్లు, ప్లేట్లు, షూస్ వంటివి ఇచ్చారా అని ఆరాతీశారు. తమకున్న పలు సమస్యలను విద్యార్థులు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్ వార్డెన్, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 8 నెలల నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రావట్లేదని, 6 నెలల నుంచి మెస్‌చార్జీలు రావట్లేదని, అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నామని సిబ్బంది హరీశ్‌రావు దృష్టికి తెచ్చారు. ట్యూటర్‌లకు సైతం సమయానికి జీతాలు రావట్లేదన్నారు. హాస్టల్ మెయింటెన్స్ ఫండ్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భోజనశాలలో బియ్యం, తదితర సామగ్రిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి హరీశ్‌రావు భోజనం చేశారు.



వసతి గృహ సమస్యలపై విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

నాడు ఎవరెస్ట్ అంత ఖ్యాతి..

మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ ఏడాది పాలనలో హాస్టళ్లు ఆగమై పోయినట్లు తెలిపారు. విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యార్థుల ప్రతిష్టను ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తున నిలబెట్టారన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జూన్ నుంచి నవంబర్ వరకు ఆరు నెలల నుంచి మెస్‌చార్జీల చెల్లింపు జరగలేదన్నారు. ఈ ఒక్క హాస్టల్‌లోనే దాదాపు రూ.9,50,000 మెస్‌చార్జీలు క్లియరెన్స్ కోసం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హాస్టల్ వార్డెన్‌లు ఉద్దెర తెచ్చి, అప్పులు తెచ్చి, బంగారం కుదవ పెట్టి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని చెప్పారు. పిల్లల ఆరోగ్యం బాగాలేకపోతే వార్డెన్‌లు, ఉపాధ్యాయులను శిక్షిస్తా అంటున్నావు.. కానీ, శిక్ష వేయాల్సింది ప్రభుత్వానికి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టవల్స్, ప్లేట్‌లు, గ్లాస్‌లు, షూస్ రాలేదని విద్యార్థులు వాపోతున్నారని.. హాస్టళ్లలో ఇలాంటి పరిస్థితి ఉందన్నారు. కొన్ని హాస్టల్‌లో వేడి నీళ్లు రాక విద్యార్థులు చలికి ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కామాటిలకు, వాచ్‌మెన్‌లకు 8 నెలల నుంచి జీతాలు రాకపోతే వారు ఎలా పని చేస్తారని, వారి కుటుంబాలు ఎలా నడవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో ఇచ్చే కాస్మోటిక్ ఛార్జీలు, వాషింగ్ ఛార్జీలు కూడా రావడం లేదన్నారు. చాలా ప్రాంతాల్లో ఎస్సీ గురుకుల పాఠశాలకు కిరాయిలు ఇచ్చే పరిస్థితి లేదని, వాటికి తాళాలు వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. తప్పు ప్రభుత్వం దగ్గర ఉందని, ఉద్యోగులను ఎందుకు ఇబ్బంది పెట్టాలన్నారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోతే ఉద్యోగులు ఏం చేస్తారన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వండుతున్నది కొత్త బియ్యమని.. అన్నం ముద్దగా అయ్యే పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాత సన్న బియ్యం పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ హాస్టల్‌లపై ఆజమాయిషీ పోయిందని, పట్టించుకునే వారు లేరన్నారు. వెంటనే మెస్‌చార్జీలు విడుదల చేయడంతో పాటు కాస్మోటిక్, ఇతర బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీలు చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు

- రైతుల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం
- గుండెనొప్పితో బాధపడుతున్న హీర్యానాయక్‌కు బేడీలా
- లగచర్ల రైతులపై రేవంత్ ప్రభుత్వం కక్ష సాధింపు తగదు
- సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్
- సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో హీర్యానాయక్‌ను పరామర్శ

లగచర్ల రైతు హీర్యానాయక్‌ను పరామర్శించేందుకు సంగారెడ్డి దవాఖానకు వచ్చిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, డిసెంబర్ 12 రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగడం లేదని, సీఎం రేవంత్ నాయకత్వం రైతుల ప్రాణాలు తీస్తున్న సర్కారు కొనసాగుతున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధ్వజమెత్తారు. గుండెనొప్పితో గురువారం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చేరిన లగచర్ల రైతు హీర్యానాయక్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. దవాఖానలో వైద్యులు హీర్యానాయక్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దవాఖా న సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్‌తో ఎమ్మెల్యే మాట్లాడి హీర్యానాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. హీర్యానాయక్‌కు గుండె సమస్య ఉందని, మరిన్ని పరీక్షలు, మెరుగైన పరీక్షల కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు తెలిపారు. వెంటనే తరలించి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని డాక్టర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. అనంతరం దవాఖాన బయట మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. గుండెనొప్పితో బాధపడుతున్న హీర్యానాయక్‌ను జైలు సిబ్బంది, పోలీసులు బేడీలతో దవాఖానకు తీసుకురావటం దారుణం అన్నారు. ఆడబిడ్డలపై ఆకృత్యాలు చేసే దుర్మార్గులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కానీ.. అమాయకులైన గిరిజన రైతులకు మాత్రం బేడీలు వేసి నేరస్తులు చిత్రీకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రక్తాన్ని స్వేదంగా మార్చి బువ్వపెట్టే గిరిజన రైతు హీర్యానాయక్‌కు రేవంత్ సర్కార్ బేడీలు వేసి దవాఖాన తీసుకురావటం హేయమైన చర్య అని, ఆయనకు ఏదైనా జరిగితే రేవంత్ సర్కార్‌దే బాధ్యత అని హెచ్చరించారు. హీర్యానాయక్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆయన ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులు నెలరోజులకు పైగా కంది జైలులో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జైలులోని మరి కొంతమంది రైతులు అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ, రైతుల పోరాటంతో లగచర్లలో ఫార్మాసిటీపై వెనక్కి తగ్గిన కాంగ్రెస్ సర్కార్ రైతుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు చేసిన నేపథ్యంలో లగచర్ల రైతులపై ఉన్న కేసులను ఎత్తివేసి రిమాండ్‌లో ఉన్న ఖైదీలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. హీర్యానాయక్‌ను పరామర్శించిన వారిలో జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొమురవెల్లి బ్రహ్మోత్సవాలపై సమీక్ష



సిద్దిపేట కలెక్టరేట్‌లో కొమురవెల్లి బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

చేర్యాల, డిసెంబర్ 12: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రభుత్వశాఖల అధికారులతో నిర్వహించాల్సిన బ్రహ్మోత్సవాల సమీక్షా సమావేశం జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించడం పలు విమర్శలకు తావిస్తున్నది. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం గతేడాది సిద్దిపేట సమీపంలోని ఓ హోటల్‌లో స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించడంపై అప్పట్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. దానిని మరుపక ముందే ఈసారి స్వామివారి కల్యాణం, జాతర నిర్వహణ కోఆర్డినేషన్ సమావేశాన్ని గురువారం మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్ అధ్యక్షతన సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించారు. గత సంప్రదాయాలను విస్మరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఆలయ ఈవో బాలాజీ, ప్రభుత్వ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళారుల దందా

- సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే అడ్డా
- రైతులను మోసం చేస్తూ కొనుగోళ్లు
- బినామీ రైతుల పేరిట సీసీఐకే విక్రయం

సదాశివపేట మండలంలోని ఓ జిన్నింగ్ మిల్లులో దళారులు తీసుకువచ్చిన పత్తి

సదాశివపేట, డిసెంబర్ 12: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాల్లో దళారులదే రాజ్యంగా నడుస్తోంది. పత్తి పంటకు దళారులే ధరను నిర్ణయించి సీసీఐ కేంద్రాల్లో బినామీ పేర్లతో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతులకు ఒక ధర చెప్పి పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను దళారులు పొందుతున్నారు. ఒక్కో వాహనానికి దాదాపు రూ. 20 నుంచి రూ. 25వేల వరకు లాభం పొంది రైతులను ముంచుతున్నారు. ఈ ఏడాది సదాశివపేట మండలంలో 33 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగైంది. ఎకరాకు 12 క్వింటాళ్ల మేర పత్తి దిగుబడి రావాల్సి ఉండగా, అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతిని ఎకరాకు 6 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. సదాశివపేట మండలంలో 3 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 3,039 రైతుల వద్ద నుంచి 98,227 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కాగా, సీసీఐ కేంద్రాల వద్దనే దళారులు బహిరంగంగా పత్తిని కొనుగోలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు చేయకపోవడంతో దళారులు రెచ్చిపోతున్నారు. సీసీఐకి నేరుగా పత్తిని తీసుకెళ్తే తేమ పేరిట కొర్రీలు పెట్టడం, అధికారులతో మాట్లాడేందుకు భాష రాకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులకు పత్తిని విక్రయిస్తున్నారు. దళారులు రూ. 6,300 నుంచి రూ. 6,500 వరకు రైతుల వద్ద పత్తిని కొని సీసీఐకి తీసుకెళ్లి బినామీ రైతుల పేరిట రూ.7200 నుంచి రూ. 7,500 ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పత్తి పంట వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడం, గ్రామ స్థాయి వ్యవసాయాధికారులు పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. దీనిని ఆసరా చేసుకుని దళారులు బినామీ రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, పట్టాపాసు పుస్తకం ఇచ్చి సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. అధికారుల అండతోనే అక్రమ కొనుగోళ్లు సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

సదాశివపేటలో రైతుల నుంచి పత్తిని బహిరంగంగానే కొనుగోలు చేస్తున్న దళారులు

ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కావద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): విద్యాలయాల్లో ఆహారం వికటించి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఈనెల 14న సంక్షేమగృహాలు, పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ నగేశ్, డీఈవో రాధాకృష్ణతో కలిసి ఎంఈవోలు, వార్డెన్‌లు, హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలోని 80 విద్యాసంస్థల్లో చేపటనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ముఖ్య అతిథితో పాఠశాలల పర్యవేక్షణ, 12 నుంచి 12:30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు/విద్యార్థులతో ముఖాముఖీ ఉంటుందని, 12:30 నుంచి ఒంటిగంట వరకు డైట్ ప్లాన్ బ్యాసర్, హ్యాండ్ బుక్ ఆవిష్కరణ, ముఖ్యఅతిథి స్పీచ్ అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం ఉంటుందని తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని, ఇందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులకు, విద్యార్థినీవిద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలన్నారు. విద్యాసంస్థలను శుభ్రంగా ఉంచాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీటీ ట్రైబల్ వెల్ఫేర్ నీలిమ, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, బీసీ, సంక్షేమ, మైనారిటీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ముత్తంగిలో తాగునీటి పైప్‌లైన్ వేస్తున్న కార్మికులు, పనులను పరిశీలిస్తున్న ఈఈ విజయలక్ష్మి

ముత్తంగికి తాగునీటి పైప్‌లైన్

- 'నమస్తే తెలంగాణ' కథనంతో తక్షణం పైప్‌లైన్ల పనులు ప్రారంభం
- రెండు రోజుల్లో నీళ్లు అందాలని ఆదేశించిన మిషన్ భగీరథ ఈఈ
- నమస్తే తెలంగాణ కథనంపై గ్రామస్తుల ప్రశంసలు

పటాన్‌చెరు, డిసెంబర్ 12: సంగారెడ్డి జిల్లా ముత్తంగికి రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని 'నమస్తే తెలంగాణ' గురువారం ప్రచురితమైన 'మళ్లీ నీటి సమస్య' కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు.కథనాన్ని చూసిన మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి తక్షణం స్పందించి పటాన్‌చెరు మిషన్ భగీరథ గ్రిడ్ బృందానికి ఆదేశాలు ఇచ్చారు. జాతీయ రహదారి విస్తరణ కోసం చేపట్టిన తవ్వకాల్లో రెండు నెలల క్రితం ముత్తంగి గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ గ్రిడ్ ప్రధాన లైన్ ధ్వంసమైంది.ఆ తర్వాత మరమ్మతులు చేయలేదు. ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో దాదాపు అరవై రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నీళ్లు లేక అద్దెకున్నవారు ఇప్పటికే ఇండ్లను ఖాళీ చేస్తున్నారు. ఈ కథనంతో విషయ తీవ్రతను గుర్తించిన జిల్లా అధికారులు రెండు రోజుల్లో ముత్తంగి వాసులకు తాగునీరు అందాలని కాంట్రాక్టర్, ఇంజినీర్లకు ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ గురువారం నుంచి పాడైన లైన్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక పైప్‌లైన్‌ను ముత్తంగి సంప్‌వరకు వేయించే పనులు చేపట్టాడు. అధికారుల పర్యవేక్షణలో పైప్‌లైన్ పనులు యుద్ధప్రాతిపాదికన చేపడుతున్నారు. శుక్రవారం వరకు తాగునీరు అందజేస్తామని మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. 'నమస్తే తెలంగాణ'పై ముత్తంగి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముత్తంగి పంచాయతీ నుంచి తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటి నుంచి సమస్యలు పెరిగాయని వారు వాపోయారు. గ్రామ కార్యదర్శి నుంచి తెల్లాపూర్ మున్సిపల్ ఉద్యోగిగా బాధ్యతలు స్వీకరించిన అధికారి సమస్యను పరిష్కరించడంలేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్ చేసిన తప్పులకు మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేశారని, ముత్తంగికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తాగునీరు ఇవ్వాలని కోరారు.